క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

మణుగూరురూరల్: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మణుగూరు ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు సందర్శించి వడ్ల లోని తేమ శాతాన్ని, తూర్పాలా యంత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తేమశాతం లేకుండా ఆరబెట్టుకోవాలని సూచించారు. సన్నబియ్యానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.500ల బోనస్ పొందాలంటే తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలన్నారు. అలాగే వరికోతల అనంతరం రైతులు తమ పొలాల్లో గడ్డిని తగులబెట్టకూడదని, అలా తగలబెట్టడం వల్ల భూమిలో పోషకాలు నశించిపోతాయని తెలిపారు.

నేత్రదానం..

చర్ల: దుమ్ముగూడెం మండలానికి చెందిన ప్రముఖ వ్యాపారి మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. లక్ష్మీనగరంకు చెందిన కటుకూరి సుబ్బారావు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు ఆయన మరొకరికి చూపునివ్వాలన్న సదుద్దేశ్యంతో రెండు నేత్రాలను హైదరాబాద్‌కు చెందిన అగర్వాల్ ఐ బ్యాంక్ సంస్థకు.. స్థానిక ప్రతినిధి జానీ ద్వారా సోమవారం అందజేశారు. దాతలకు పలువురు అభినందించారు. భద్రాచలం ప్రాంతంలో ఎవరైనా మరణిస్తే వారి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చే వారు 72880 84777 నంబర్‌కు సంప్రదించాలని అగర్వాల్ ఐ బ్యాంకు ప్రతినిధి జానీ కోరారు.

ఎంఈఓను నియమించాలి

చర్ల: చర్ల మండలానికి రెగ్యులర్ మండల విద్యాశాఖాధికారిని నియమించాలని, అర్హులైన ఉపాధ్యాయులందరికీ పదోన్నతి కల్పించాలని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బోదెబోయిన జయబాబు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఏటీఎఫ్ కార్యాలయంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి తాటి నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో 29 శాఖలకు సంబంధించి చేపట్టే ఉద్యోగ నియామకాలలో 100 శాతం గిరిజనులకే అవకాశం కల్పించాలని చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా ఏజెన్సీ డీఎస్సీని నిర్వహించాలని కోరారు. సమావేశంలో రాయకులు సపకా నాగరాజు, బి.దశరథం, పర్శిక నాగేశ్వరావు, పూనెం విఠల్‌బాబు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

మణుగూరుటౌన్: వాతావరణం మారిన నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యుడు శివకుమార్ అన్నారు. సోమవారం పీహెచ్‌సీ వైద్యబృందం ముగ్గురు వైద్యులు వేర్వేరు బృందాలుగా మండలంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలిక వసతిగృహాలను సందర్శించారు. హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మందులు అందించారు. కార్యక్రమాల్లో వైద్యులు నిశాంత్‌రావు, సునీల్, సిబ్బంది రాంప్రసాద్ పాల్గొన్నారు.

కుల ధ్రువపత్రాలు ఇవ్వాలి

చర్ల: ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి తెలంగాణాలో నివాసముంటున్న ఆదివాసీలందరికీ ఎస్టీ కులధ్రువపత్రాలివ్వాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలో 22కు పైగా ఉన్న వలస ఆదివాసీలతో కలిసి సోమవారం చర్లలో ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చిన ఆదివాసీలకు ఓటు గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఉన్నప్పటికీ.. వీరంతా ఇక్కడి వారు కాదంటూ ఎస్టీ కులధ్రువపత్రాలను నిరాకరిస్తున్నారని అన్నారు. నాయకులు, వలస ఆదివాసీ గ్రామాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నివాళులర్పించిన మువ్వా

దమ్మపేట: మండలంలోని ముష్టిబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఉడతనేని మధు మాతృమూర్తి సత్యావతి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా.. మృతురాలికి సమీప బంధువు అయిన రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయబాబు సోమవారం ఆమె చిత్రపటానికి పూలతో ఘనంగా నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మండల కాంగ్రెస్ నాయకులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, కాంగ్రెస్ నాయకులు రావు గంగాధరరావు, పర్వతనేని ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, సాయిల నర్సీ, వాసం శ్రీను, చిన్నశెట్టి సత్యనారాయణ, రాధకృష్ణ, పగడాల రాంబాబు, వాసం వేణు పాల్గొన్నారు.

గ్యారంటీలను అమలు చేయాలి

చంద్రుగొండ: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన ఆరుగ్యారంటీల హామీలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు వరికూటి వెంకట్రావ్, కారం వెంకటేశ్వర్లు, తేజావత్ భీముడు, టి.వెంకటేశ్వర్లు, పద్దం శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు.. సౌకర్యాలు నిల్లు

- ఇళ్లు కేటాయించి చేతులు దులుపుకున్న అధికారులు
- నీరు, విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
- చర్యలు చేపట్టాలని వేడుకోలు



కిటికీ తలుపు లేకుండా ఉన్న ఇల్లు



సరైన దారి వసతి లేని డబుల్ ఇళ్లు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీ, మనుబోతుల చెరువు కాలనీలో నిర్మాణం పూర్తైన 111 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసి మూడు రోజుల క్రితం పంపిణీ చేశారు. కానీ ఇళ్లలో ప్రజలు ఉండేందుకు ఎటువంటి సౌకర్యాలూ కల్పించ లేదు. దీంతో ఇళ్లలో చేరేందుకు లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. విద్యుత్, తాగు నీరు లేకుండా ఎలా వెళ్లేదంటూ.. అధికారులను నిలదీస్తున్నారు.

చోరీకి గురైన సామగ్రి

గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లలో అప్పుడు విద్యుత్‌తోపాటు తాగు నీటి సౌకర్యాలు కల్పించారు. తరువాత ప్రభుత్వం మారిపోవడంతో ఇళ్ళ పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో ఇళ్లు శిథిలావస్థకు చేరి అకతాయిలకు అడ్డగా మారాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇళ్ళలో ఏర్పాటు చేసిన విద్యుత్ సామగ్రి, నీటి సరఫరా చేసేందుకు అమర్చిన పైపులు, ట్యాప్‌లు చోరీకి గురయ్యాయి.

వృద్ధులకు మూడో అంతస్తు

విద్యుత్, తాగునీటితోపటు పలు సమస్యలు లబ్ధిదారులను వేదిస్తున్నాయి. ఇక్కడ ఒక్క ట్యాంకర్‌తోనే నీరు రావడంతో స్థానికులకు పూర్తి స్థాయిలో సరిపోవడం లేదు. దీనికి తోడు వృద్ధులు, వికలాంగులకు మూడో అంతస్తులో ఇళ్లు కేటాయించడంతో వారు కింద నుంచి పైకి నీరు తీసుకెళ్ళేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. అధికారులు వస్తారు..సౌకర్యాలు కల్పిస్తారని లబ్ధిదారులు పనులు మానుకుని ఇళ్ళ వద్ద ఎదురుచూస్తున్నారు. కానీ అధికారులు మాత్రం ఇళ్ల ఇచ్చి చేతులు దులుపుకుని కనీసం ఎలా ఉంటున్నారని తెలుసుకునేందుకు తమ వంక కన్నెత్తి చూడడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

ఇళ్లకు వెళ్లేందుకు దారి లేదు..

మనుబోతుల చెరువు కాలనీలో ప్రజలకు పంపిణీ చేసిన ఇళ్లకు కనీసం దారి కూడా లేదు. ఇళ్ల చుట్టూ భారీగా పెరిగిన తుమ్మ చెట్లతో పాటు పొదలు ఉండడంతో లబిధదారులే కొంత మేర చెట్లను తొలగించుకున్నారు. ఊరికి చివర ఉండడంతో పాటు పొదల నుంచి విష సర్పాలు వచ్చే ప్రమాదం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఇళ్లకు కిటికీలకు, మరుగుదొడ్లకు డోర్లు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇళ్లు శుభ్రం చేసేందుకు వీలులేదు



నూతనంగా కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు శుభ్రం చేసుకునేందుకు వీలు లేకుండా నిర్మించారు. గదుల్లో ఎక్కడా రంధ్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కడిగిన నీరు ఎత్తిపోసుకోవాల్సి వస్తోంది. ఇళ్ళు శుభ్రం చేసుకునేందు తీవ్రంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది.

– గౌరీ, ఏఎమ్‌సీ కాలనీ

కరెంట్, నీటి సౌకర్యం కల్పించాలి



మాకు ఇళ్లు మంజూరి చేసిన అధికారులకు ధన్యవాదాలు. కానీ ఇళ్లలో ఉండేందుకు వీలుగా కరెంట్, నీటి సౌకర్యాలను కల్పించాల్సింది. ఇళ్లు శుభ్రం చేసేందుకు కూడా నీళ్లు లేకపోవడంతో ఇక ఇంట్లోకి వెళ్లలేదు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాను.

– విజయ్, ఏఎమ్‌సీ కాలనీ

ఇళ్ల చుట్టూ పొదలు తొలగించాలి



మాకు కేటాయించిన ఇళ్లకు వెళ్లేందుకు కనీసం దారి సరిగా లేదు. ఇళ్ల చుట్టు తుమ్మ చెట్లతో పొదలు ఏపుగా పెరిగాయి. చుట్టూ చెట్లు పెరగడంతో విష సర్పాలు వస్తాయని భయం వేస్తోంది. ఇళ్ళ చుట్టు ఉన్న చెట్లను తొలగించి, రహదారి నిర్మించాలని అధికారులను వేడుకుంటున్నాను.

– శోభారాణి, మనుబోతుల చెరువు కాలనీ

అక్రమ కట్టడాల కూల్చివేత



కారు స్టాండ్‌ను జేసీబీ సాయంతో తొలగిస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ అవుట్ గేట్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాలను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న కట్టడాలను భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు సోమవారం జేసీబీ సహాయంతో తొలగించారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్‌లను అక్రమించిన విషయంపై అక్టోబర్ నెలలోనే 'సాక్షి'లో కథనాలు ప్రచురించింది. దీంతో పంచాయతీ ఈఓ ఆధ్వర్యంలో ఐటీడీఏ రోడ్డులో ఉన్న పలు అక్రమ దుకాణాలను తొలగించారు. ప్రస్తుతం ఆర్టీసీ అవుట్ గేట్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఏర్పాటు చేసుకున్న కారు స్టాండ్‌ను తొలగించారు. కట్టడాలను తొలగిస్తున్న క్రమంలో కారు స్టాండ్ కార్మికులు ఆందోళనకు దిగడంతో కారు స్టాండ్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయంగా వేరే స్థలాన్ని కేటాయిస్తామని, ఈ ప్రాంతంలో ప్రజల సహాయార్థంగా టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నామని ఈఓ శ్రీనివాసరావు వారిని సముదాయించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరు



చంద్రుగొండలోని మార్కెట్ గోదాముల వద్దకు చేరుకున్న ధాన్యం

సాక్షి ఎఫెక్ట్..

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండకు ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరైంది. సాక్షి దినపత్రికలో వరుసగా ప్రచురితమైన కథనాలు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మండల నాయకులు భోజ్యా నాయక్, కీసరి కిరణ్‌రెడ్డి ప్రయత్నాలతో కేంద్రం మంజూరైంది. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారి ఖుర్షీద్ స్పందించారు. గుంపెన గ్రామంలోని సహకార పరపతి సంఘం సీఈఓ సున్నం వెంకటేశ్వర్లు చంద్రుగొండలోని వ్యవసాయ మార్కెట్ గిడ్డంగుల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు నేటి నుంచి కొనుగోళ్లు చేపడుతామని, రైతులు తమ ధాన్యం నిబంధన ప్రకారం కేంద్రానికి తీసుకురావాలని సీఈఓ సూచించారు.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

చర్ల: దుమ్ముగూడెం మండలంలో ఆదివాసీ, గిరిజన కేంద్రాలకు కేంద్ర బిందువుగా ఉన్న లచ్చిగూడెంలో ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కొమరం దామోదర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన లక్ష్మీనగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లచ్చిగూడెంలో ప్రభుత్వ వైద్యశాలను ఏర్పాటు చేయడం వల్ల దుమ్ముగూడెం మండలంలోని 21 గ్రామాలకు, రామచంద్రునిపేట, కొత్తపల్లి, నారాయణరావుపేట కొత్తపల్లి గ్రామాల్లోని ఆశ్రమ పాఠశాలలకు చెందిన సుమారు 1600 మంది విద్యార్థులకు వైద్యం దగ్గరవుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో నాయకులు కెల్లా వేణు, సోందె వీరాస్వామి, కల్లూరి ప్రసాద్, లక్ష్మయ్య, శ్రీరాములు, రేసు సుజాత, కల్యాణి పాల్గొన్నారు.

శబరిమలైకి పయనం

గుండాల: 41 రోజులపాటు దీక్షలు చేపట్టిన అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టుకుని శబరిమలైకి పయనమయ్యారు. సోమవారం స్థానిక రామాలయంలో పూజారులు ఎస్.వెంకన్న, సనత్ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. అనంతరం నటరాజన్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పకు అభిషేకం చేశారు. అనంతరం స్వాములకు ప్రత్యేక పూజలతో ఇరుముళ్లు కట్టారు. ఆపై శబరిమలైకి పయనమయ్యారు. గురు స్వాములు రవి, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్లు కేటాయించాలి



తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న మనుబోతుల చెరువు వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి తమ ఇళ్లను తొలగించారని, డబుల్ బెడ్రూంలలో తమకూ కేటాయిస్తామని చెప్పి ఇప్పటి వరకు పట్టించుకున్నది లేదని 14 కుటుంబాలకు చెందిన నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వాసితులుతో కలిసి సీపీఎం నాయకులు భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ.. ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు గత తొమ్మిది సంవత్సరాలుగా అద్దె ఇళ్ల ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు వాస్తవాలను విచారించి, బాధితులుగా ఉన్న నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నకిరికంటి నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు అలవాల రాజా, నిర్వాసితులు బంటు రామకృష్ణ, వెట్టి చిలకమ్మ, కళావతి, సావిత్రి, హిమాంబి, గంగమ్మ, నాగమణి, వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

దమ్మపేట: గంగారం 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మత్తుల నిర్వహణ కారణంగా నేడు (మంగళవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ శాఖ ఏఈ సాయికిరణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో కోత ఉంటుందని తెలిపారు.

వృద్ధులకు స్వెట్టర్ల పంపిణీ

భద్రాచలంటౌన్: చలి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా భద్రాచలం పట్టణం కూనవరం రోడ్‌లోని మానవసేవ అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం స్వెట్టర్లు పంపిణీ చేశారు. పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ యజమాని వాణి కుమారి, వాణిరామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వెట్టర్లు అందజేయగా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెన్ను మహంతి రమేష్, రమేష్, ఆశ్రమ నిర్వాహకురాలు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, పాత మామిళ్లవారిగూడెం, అశ్వారావుపేటలోని కొనేరుబజారుతోపాటు పలు చోట ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆరుద్రా నక్షత్రం మార్గశిర మాసం ప్రారంభం సందర్భంగా ఈశ్వరుడికి అభిషేకాలు చేస్తే పుణ్యఫలంతోపాటు మేలు జరుగుతుందని భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాల తరలివచ్చారు. ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకొని వివిధ రకాల అభిషేకాలు చేసి నైవైద్యాలు సమర్పించారు. దీంతో ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది.

పారదర్శకంగా నిర్వహించాలి

ములకలపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య సూచించారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మండలకమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని అన్నారు. అర్హులైన ప్రతీనిరుపేదకూ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యాదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్. పొడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, కుంజా రామ్మూర్తి, గొగ్గెల ఆదినారాయణ, నిమ్మల మధు, మంచాల సారయ్య, గగులోతు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో అభివృద్ధి

గుండాల: ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఐడీఓ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ నరేందర్ అన్నారు. సోమవారం ఆళ్లపల్లి మండలం మర్కోడు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత పెరిగినందున విద్యార్థులకు దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. హెచ్‌ఎం ముత్తయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణాలో కేసీహెచ్‌పీది కీలకపాత్ర



మణుగూరురూరల్: మొక్క నాటుతున్న ఏరియా జీఎం రామచందర్

మణుగూరుటౌన్: బొగ్గు రవాణాలో కేసీహెచ్‌పీది కీలకపాత్ర అని మల్టీ డిపార్ట్‌మెంట్ బృందం కన్వీనర్, జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. సోమవారం ఈ నెల 9వ తేదీ నుంచి 16వరకు నిర్వహిస్తున్న మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రవాణాలో ఎలాంటి ఆటంకం కలగకుండా యంత్రాల పనితీరును అనుక్షణం పర్యవేక్షిస్తూ ఉండాలని, బ్రేక్‌డౌన్ జరిగే అవకాశాలను ముందుగానే పసిగట్టి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బ్రేక్‌డౌన్ సమయంలో యంత్రాలకు వెంటనే మరమ్మతులు నిర్వహించి అదనపు పరికరాలు ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వార్షిక బొగ్గు రవాణా లక్ష్యాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, ఆర్.శ్రీనివాస్, ఎస్.రమేష్, మదన్‌నాయక్, వెంకట్‌రావు, అనురాధా, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు, ఓంకార్ బాపు, శ్రీనివాస్, కేసీహెచ్‌పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలి

మణుగూరురూరల్: ప్రతీ ఒక్కరు మొక్కల పరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ సూచించారు. జీఎం కార్యాలయ ఆవరణలో మొక్కల నాటే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల పెంపకం వల్ల వాయు కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం డి.శ్యాంసుందర్, ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, డీజీఎం(ఐఈడీ) వెంకట్రావు, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, డీజీఎం(ఫైనాన్స్) అనురాధ, ఏఎస్ఓ వెంకటరామారావు, ఏరియా సర్వే అధికారి శైలేంద్ర కుమార్, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, సీనియర్ పిఓలు సింగు శ్రీనివాస్, వి రామేశ్వరరావు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఓసీతో పొంచి ఉన్న ప్రమాదం'

మణుగూరుటౌన్: మణుగూరు ఓసీ కారణంగా ప్రమాదం పొంచి ఉందని, రాజుపేట విఠల్‌రావు నగర్ ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య చారి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విపరీతమైన బొగ్గు చూర, దుమ్ము, ధూళితో ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని, ఓసీ బ్లాస్టింగ్ కారణంగా ఇల్లు కూలిపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. సింగరేణి, ప్రభుత్వాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆ గ్రామాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. కాళీమాత ఏరియా, గాంధీనగర్ ఏరియాలలో బీటీపీఎస్ రైల్వేట్రాక్ నిర్మాణం నేపథ్యంలో అన్ని పడగొట్టడం వల్ల కొందరు రాత్రీపగలు గంజాయి సేవించి దౌర్జన్యాలకు పాల్పడుతుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గ్యాల సుధాకర్, మున్నా లక్ష్మీకుమారి, రమేశ్ తదితరులు ఉన్నారు.

అవార్డు అందుకున్న జగన్మోహన్‌రెడ్డి



అవార్డు అందుకుంటున్న జగన్మోహన్‌రెడ్డి

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీ పరిధి సంతోష్‌నగర్‌లోని శ్రీవిద్యాభ్యాస(బాలవెలుగు) నిర్వాహకుడు బి.జగన్మోహన్‌రెడ్డికి బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) బాధ్యులు బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు అందజేశారు. న్యూఢిల్లీలోని సోమవారం జరిగిన సమావేశంలో ఆయన ఢిల్లీ ఎమ్మెల్యే వికేష్ రవి, బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మణుగూరు, పరిసర ప్రాంతాల్లో వలస గొత్తికోయల కుటుంబాల పిల్లలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పుతున్న జగన్మోహన్‌రెడ్డి సేవలను గుర్తించి అవార్డ్ అందించినట్లు రాధాకృష్ణ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఇరవై ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత తొలి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు సోమవారం వారంతా వేదాంతపురం అటవీ ప్రాంతంలోని స్వయంభు శ్రీ వనదుర్గాంబిక సమేత వనలింగేశ్వరస్వామి ఆలయంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఒకే వేదికపై కలిశారు. పూర్వ విద్యార్థులంతా అక్కడికి చేరుకుని ఆత్మీయంగా పలికరించుకున్నారు. అలనాటి బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే గడిపి ఆట, పాటలతో సందడి చేశారు. ఆ తర్వాత ఆస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

విద్యారంగ సమస్యలపై 'చలో అసెంబ్లీ'

భద్రాచలంటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టబోతున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మునిగేల శివ ప్రశాంత్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ విద్యా సంస్థలకు నూతన భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించి, విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజన పథకం అమలు చేసి నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట నుంచి మణుగూరు రైల్వేస్టేషన్‌కు రాత్రి రైలు సమయానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల నుంచి ప్రతి రోజూ వందలాది మంది దూరప్రాంతాలకు వెళ్లడానికి మణుగూరు సూపర్‌ఫాస్ట్ రైలు కొరకు మణుగూరు వెళ్తుంటారు. బస్సు సౌకర్యం లేక ఆటోలు, బైక్‌లు, ప్రైవేటు వాహనాలపై ప్రజలు రైల్వేస్టేషన్‌కు వెళ్తుంటారు. భారజల కర్మాగారం ఉద్యోగులు రైల్వేస్టేషన్‌కు వెళ్లే బస్సులు బయటి వారికి ఆపకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు సమయానికి ఆర్టీసీ బస్సు నడపాలని ఈ విషయంపై ఆర్టీసీ డీఎం, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేతనాలు విడుదల చేయాలి

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వ గిరిజన పాఠశాలతో పాటు హాస్టళ్లలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలకు గత పది నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో వారందరూ సోమవారం భద్రాచలం ఐటీడీఏ పీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికై నా ఐటీడీఏ అధికారులు స్పందించి వారి వేతనాలు విడుదల కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సంఘ బాధ్యులు పద్మ, కౌసల్య, సరిత, లక్ష్మి, సుధారాణి, కుమారి, శ్రావణి, స్వరూప, ఎ.నాగమణి, పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



మణుగూరురూరల్: సర్వే నిర్వహిస్తున్న ఉద్యోగులు

మణుగూరురూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు గ్రామాల్లో ముమ్మరంగా నిర్వహించారు. మండలంలోని కూనవరం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న సర్వేను సోమవారం కాంగ్రెస్ నాయకులు, సర్వే కమిటీ సభ్యుడు గుడిపూడి కోటేశ్వరరావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సర్వేను పారదర్శకంగా చేపడుతోందన్నారు. అర్హులైన వారు సర్వేకు వచ్చే అధికారులు, సిబ్బందికి తమ వివరాలను తెలిపి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి గాదె ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది ఊర్మిళ, కాంగ్రెస్ నాయకులు వల్లభనేని ఉపేందర్, వాహేద్, సత్యనారాయణ, ఇజహర్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం, ప్రభుత్వం చేపట్టిన సర్వేను సోమవారం దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి పరిశీలించారు. మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించిన చైర్మన్.. ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా సర్వేను నిష్పక్షపాతంగా, సమగ్రంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణు, కాంగ్రెస్ నాయకులు చెలికాని ప్రసాద్, వాసం శ్రీను, రెడ్డిమళ్ల చిట్టి నాయన, కూరం అర్జునరావు, వాసం వేణు తదితరులు పాల్గొన్నారు.